క్లుప్తంగా

నేడు ఎంపీలు, ఎమ్మెల్యే పర్యటన

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లెలో శనివారం జరిగే రైతు సమావేశానికి రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి హాజరుకానున్నట్లు రైతు సంఘ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని కోరారు.

నేడు అధికారులతో ఎమ్మెల్సీ భరత్ సమీక్ష

రామకుప్పం: ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో శనివారం ఉదయం 10.30 గంటలకు మండల అభివృద్ధిపై ఎమ్మెల్సీ భరత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహి స్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలపై సమీక్ష జరుగుతుందన్నారు. అదేవిధంగా మండలంలో సేవా వజ్ర ఒకరు, సేవారత్న అందుకున్న ఐదుగురు వలంటీర్లను సన్మానిస్తారని తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరుకావాలన్నారు. మం డలంలో సేవామిత్ర అవార్డు అందుకున్న 223 మంది వలంటీర్లకు ఆయా సచివాలయ పరిధిలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

గంగవరం: పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు సీడీపీవో ఇందిరప్రియదర్శిని ఒక ప్రకటనలో తెలిపారు. పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

బాలికల జూనియర్ కళాశాల ప్రారంభం

వి.కోట: పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి జూనియర్ కళాశాల ప్రారంభిస్తున్నట్లు హెచ్‌ఎం నీరాజక్షులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసైన బాలికలు జూనియర్ ఇంటర్‌లో చేరవచ్చని కోరారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన ఉంటుందని పేర్కొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

సోమల: స్వయం సహాయ సంఘాల ద్వారా రుణాలు పొందే సభ్యులు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం శివయ్య అన్నారు. శుక్రవారం ఆవులపల్లె పంచాయతీకి చెందిన స్వయం సహాయ సంఘాల సభ్యులకు రుణాలపై అవగాహన కల్పించారు. రుణాలను సకాలంలో చెల్లించి ప్రభుత్వం ఇస్తున్న సున్నా వడ్డీ రాయితీని పొందాలన్నారు. అనంతరం ఏడు స్వయం సహాయక సంఘాలకు నంజంపేట సప్తగిరి గ్రామీణ బ్యాంకు ద్వారా రూ.76.50 లక్షల రుణాలను అందించారు. కార్యక్రమంలో సీసీలు నరసింహులు, సంఘమిత్రలు యాస్మిన్, కిష్టయ్య, మండల సామాఖ్య అధ్యక్షురాలు ఝాన్సీ పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లోపు బీజేపీని బలోపేతం చేద్దామని పార్టీ అసెంబ్లీ కన్వీనర్ గొనివారి విజయ కుమార్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యా లయంలో శుక్రవారం బీజేపీ కార్యవర్గ సమా వేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు సమష్టిగా పనిచేయాలని సూచించారు. నాయకులు నక్కా రామచంద్ర, మార్కొండయ్య, బసలింగప్ప, తాతయ్య పాల్గొన్నారు.

సర్కార్ బడులపై 'పది'ంతల నమ్మకం

పలమనేరు నియోజకవర్గంలో సర్కార్ బడులపై తల్లిదండ్రుల నమ్మకం పెరిగింది. పది ఫలితాల్లో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు సత్తా చాటారు. నాడు–నేడు కింద ప్రభుత్వం బడులను బాగా అభివృద్ధి చేసింది. మౌలిక సదుపాయాలతో బాటు జగనన్న విద్యాకానుక ద్వారా పిల్లలకు అవసరమైన యూనిఫాం, పుస్తకాలు, షూలు తదితరాలను అందించింది. ఉత్తమ విద్యాబోధన, మెరుగుపడిన సౌకర్యాలతో పిల్లలు మంచి ఫలితాలను సాధించి మట్టిలో మాణిక్యాల్లా మంచిపేరును తెచ్చిపెట్టారు.

- నాడు–నేడుతో సర్వ హంగులు
- సత్ఫలితాలిచ్చిన అమ్మఒడి, జగనన్న విద్యాకానుక
- మెరుగైన పది పరీక్షల ఫలితాలే సాక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలలే మేలంటున్న తల్లిదండ్రులు



పలమనేరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసిందనేందుకు ఇటీవల విడుదైల పదో తరగతి ఫలితాలనే నిదర్శంగా చెప్పవచ్చు. ప్రైవేటు దీటుగా అత్యధిక శాతం 560కి మార్కులు సాధించారు. గత టీడీపీ సర్కారు పాలనలో పాఠశాలంటే ప్రజల్లో ఓ చులకన భావం కనిపించేది. ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు కొమ్ముగాసి సర్కారు బడులను గాలికొదిలేసింది. ఫలితంగా బడుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూలినాలీ చేసుకొనే వారు సైతం పిల్లల్ని ప్రైవేటు స్కూళ్లకే పంపాల్సిన పరిస్థితి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. మన బడి నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేసింది. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక,, నాణ్య బోధన, నాడు–నేడు కింద మెరుగైన వసతులు కల్పించడం తదితరాలతో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడులకే పంపుతున్నారు. విద్యార్థులు సైతం తాము ప్రభుత్వ బడిలోనే చదువుకుంటున్నారు. దీనికి తోడు నియోజకవర్గంలోని ప్రభుత్వ బడుల్లో మొన్నటి పదోతరగతి ఫలితాల్లో 80 శాతం దాకా ఫలితాలను సాధించి తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకాన్ని పెంచాయి.

ఉత్తమ బోధనతో టాపర్‌గా..



మండలంలోని రాజుపల్లె హైస్కూల్‌లో టెన్త్ పాసైయ్యాను. మాది పెద్దవెలగటూరు గ్రామం. మాతల్లి దండ్రులు సుబ్బరామయ్య, నీలమ్మ వ్యవసాయం చేసి నన్ను బడికి పంపారు. ఉత్తమ బోధన, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుకుంటూ బాగా చదివాను. మండల టాపర్‌గా నిలిచానంటే కారణం మా బడి, టీచర్లే.

– నేత్ర, పెద్దపంజాణి మండల టాపర్

ప్రభుత్వం దూరదృష్టి



నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను ఈ ప్రభుత్వం బాగా అభివృద్ధి చేసింది. పిల్లలకు అవసరమైన సౌకర్యాలు, వారికి జగనన్న విద్యాకానుక ద్వారా కావాల్సినవన్నీ సమకూరాయి. దీని ఫలితమే ఈ దఫా పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కారణమైంది. గతంలో కాకుండా సర్కారు బడులపై తల్లిదండ్రుల్లో ఇప్పుడు నమ్మకం పెరిగింది.

– లీలారాణి, ఎంఈవో పలమనేరు

నియోజకవర్గంలో ఇలా..

ప్రభుత్వ పాఠశాలలు : (ప్రైమరీ,యూపీ, హైస్కూళ్లు)	469
ఫస్ట్‌ఫేజ్ నాడునేడు బడులు :	123
ప్రభుత్వం పెట్టిన ఖర్చు :	రూ.32.87 కోట్లు
సెకెండ్ ఫేజ్ పాఠశాలలు :	230
ఖర్చుచేయనున్న మొత్తం రూ.62 కోట్లకు పైగా	



తరగతిగదిలో బల్లలు

టెన్త్ ఫలితాలిలా..

మండలం	విద్యార్థులు	ఉత్తీర్ణులైన వారు	ఉత్తీర్ణత శాతం
పలమనేరు	728	507	79.02
పెద్దపంజాణి	667	433	64.72
బైరెడ్డిపల్లె	706	508	71.95
గంగవరం	573	390	62.63
వీకోట	1121	659	58.79



హ్యాండ్‌వాష్, ఆర్వో ప్లాంట్

రహదారి నిబంధనలు పాటించాలి



ఎస్‌ఐ ప్రతాపెడ్డి

గంగవరం: రహదారి నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు సహకరించాలని ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం గంగవరం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల్లో ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తలు పాటించక పోతుండడంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఎన్నిసార్లు హెచ్చరిస్తున్నా వాహనదారుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహన రికార్డులు వెంటే ఉంచుకోవాలని తెలిపారు. లైసెన్స్ లేని వారు వాహనాలు నడుపకూడదని హెచ్చరించారు. ఎక్కువ దూరం కార్లు, ఇతర పెద్ద వాహనాలు నడపాల్సి వస్తే అక్కడక్కడా హోటల్స్, బస్‌బే లాంటి ప్రదేశాల వద్ద కొద్ది సేపు సేదతీరాలని సూచించారు. లాంగ్ డ్రైవింగ్‌లో డ్రైవర్ అలుపన్నది లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామీణ ప్రజలు కూడా రోడ్డు క్రాస్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని, సాహసాలకు పోయి ప్రాణాలు పోగొట్టుకోవద్దని కోరారు. నిర్దేశించిన దారిలోనే రోడ్డు దాటాలని సూచించారు. రహదారి నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

జగనన్నకు చెబుదాంపై అవగాహన



గానుగచింతలో అవగాహన కల్పిస్తున్న సచివాలయ సిబ్బంది

రొంపిచెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్ర శుక్రవారం తెలిపారు. గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారా గ్రామాల్లో ప్రచారం చేస్తున్నామని చెప్పారు. సచివాలయ సిబ్బంది ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని సర్వే చేయాలన్నారు. లబ్ధిదారులకు అందకపోతే కారణం తెలుసుకోవాలన్నారు. కార్యదర్శులు నాగరాజ, శివగణేష్, హరిబాబు, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం

కుప్పం రూరల్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై వలంటీర్లు విస్తృత ప్రచారం చేస్తున్నారు. కుప్పం మండల పరిధిలోని ప్రతి గ్రామంలో వలంటీర్లకు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఏదైనా సమస్యలు ఉంటే 1902కు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఈ ఫిర్యాదు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుతుందని, తద్వారా త్వరితగతిన సమస్యలు పరిష్కారమవుతాయని వివరిస్తున్నారు. సంక్షేమ పథకాల అమల్లో ఎలాంటి లోటుపాట్లు ఉన్నా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. శుక్రవారం గుడ్లనాయనపల్లె, జరుగు పంచాయతీల్లో వలంటీర్లు విస్తృత ప్రచారం నిర్వహించారు. వీఆర్వో మురుగేష్, కార్యదర్శి భాస్కర్, డిజిటల్ అసిస్టెంట్ రంజిత్, వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, వలంటీర్లు గణపతి ప్రచారంలో పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారం అభినందనీయం



కృతజ్ఞతలు తెలుపుతున్న మైనారిటీ నాయకులు

సదుం: హజ్ యాత్రకు వెళ్లే ముస్లింల అదనపు భారాన్ని భరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని మండల ముస్లిం మైనారిటీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ ఎల్లప్ప, మాజీ సర్పంచ్ సయ్యద్‌బాషా, నాయకులు ఖాజాపీర్, ఖమ్రుద్దీన్, కాలేషా, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు భూమి పంపిణీ చేయాలి

వి.కోట: మండలంలోని కనుమనాయనపల్లె దళితులకు ప్రభుత్వ గయ్యాల భూమిని పంపిణీ చేసి ఆదుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు కోరారు. శుక్రవారం ఈమేరకు తహసీల్దార్ మురళికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కొంగాటం పంచాయతీ కనమనాయనపల్లెలో అర్హులైన ఏడుగురు దళితులకు సర్వే 507/2లో రెండు ఎకరాల 36 సెంట్లు, 507/3లో రెండు ఎకరాల 44 సెంట్లు, 509/1ఏలో రెండు ఎకరాల 05 సెంట్ల ప్రభుత్వ గయ్యాల భూమిని పంచాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నియోజకవర్గ కార్యదర్శి సుబ్రమణ్యం, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

రామకుప్పం: మండల పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం ఉదయం 10.30 గంటలకు వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. మొత్తం 11 వాహనాలను పోలీసు స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కల వారు ఆధార్‌కార్డుతో నిర్దేశించిన సొమ్మును చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

పుంగనూరు: పట్టణంలోని ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలను శనివారం వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. వివిధ కేసుల్లో పట్టుబడిన 7 ద్విచక్ర వాహనాలను మధ్యాహ్నం ఒంటి గంటకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని కోరారు.

వడ్డెర భవనానికి భూమి కేటాయింపు



చదును పనులు చేయిస్తున్న సంఘం నాయకులు

శాంతిపురం: కుప్పం నియోజకవర్గంలోని వడ్డెర కులస్తుల కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించింది. తమ కులస్తుల అవసరాల కోసం భూమిని కేటాయించాలని కోరుతూ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. ఎమ్మెల్సీ భరత్ సిఫార్సు చేశారు. ఈ మేరకు తుమ్మిశి పంచాయతీలోని తులసినాయపల్లె వద్ద జాతీయ రహదారి పక్కన 0.88 ఎకరాలు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయి. ప్రభుత్వం భూమిని కేటాయించడంతో వడ్డెర కుల నాయకులు శుక్ర వారం ఈ భూమిలో చదును పనులను పనులను ప్రారంభించారు. చరిత్రలో తొలిసారిగా తమ కులాన్ని గుర్తించి, కమ్యూనిటీ భవనం కోసం భూమిని కేటాయించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి వడ్డెర నాయకులు పెద్దన్న, చెంగమరాజు, వెంకటస్వామి, వీరబద్ర, రామచంద్రప్ప, రమణప్ప కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం



ఐరాల: గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బీరప్పచెరువులో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్ల వద్దకే వెళ్లి రోగుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణవతి, హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై తక్షణం స్పందించాలి



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

బైరెడ్డిపల్లె : స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీ సూచించారు. మండలంలోని లక్కనపల్లె సచివాలయాన్ని శుక్రవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. జగనన్నకు చెబుతాం కార్యక్రమంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. సర్వేలను సకాలంలో పూర్తి చేసి నివేదికలు అందజేయాలన్నారు. సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

నేడు రామకుప్పంలో గడప గడపకు

రామకుప్పం: మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి తెలిపారు. ఇంటింటికీ వెళ్ల పథకాల లబ్ధిపై ఆరా తీయడంతోపాటు సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

రేపు నాగిరెడ్డిపల్లె సచివాయల పరిధిలో

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో 28, 29 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి తెలిపారు. 28వ తేదీ రాగిమాకులపల్లె, కడపల్లె ఎస్టీ కాలని, గొడమాకులపల్లె, చెల్లావారిపల్లె, తిరుమలకొండయ్యపల్లె, బొంతలవారిపల్లెలో, 29వ తేది నడింపల్లె, సూరకుంట్ల, నాగిరెడ్డిపల్లె, లింగమనాయునిపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పేద బలిజ వధూవరులకు పెళ్లికానుక



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద బాస్ నాయకులు

పలమనేరు: పేద బలిజ సామాజిక వర్గంలోని వధూవరులకు పెళ్లి కానుక పేరిట ఆర్థిక సాయాన్ని అందించనున్నట్టు స్థానిక బాస్(బలిజ సేవాసమితి) నాయకులు వెల్లడించారు. పట్టణంలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని ఆవిష్కరించి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హరీష్ నాయుడు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాస్ నాయకులు మాట్లాడుతూ బలిజల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.

నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం



రూ.లక్ష విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం ఐరాల మండలం పెళ్లిగుండ్ల పల్లెకు చెందిన హరిత ఆలయ అధికారులకు అందించారు. మధ్యాహ్నం దాత కుటుంబ సభ్యులకు ఆలయ ఇన్‌స్పెక్టర్ వద్ద స్వామివారి నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళం అందించారు. వారికి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ విత్తన కాయలు



పలమనేరు: టి.వడ్డూరులో విత్తనాల పంపిణీని పరిశీలిస్తున్న ఏడీఏ అన్నపూర్ణాదేవి



సదుం: విత్తనకాయలు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

పలమనేరు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్‌కు సంబంధించిన సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమం శుక్రవారం మొదలైంది. ఈ సందర్భంగా మండలంలోని కొలమాసనపల్లె, కల్లాడు, మొరం ఆర్‌బీకేలో విత్తనాల పంపిణీని స్థానిక ఏడీ అన్నపూర్ణాదేవి తనిఖీ చేశారు. విత్తనాలు పొందిన రైతులు కచ్చితంగా సాగు చేయాలని సూచించారు. ఎవరైనా విత్తనాలను పొంది అమ్ముకున్నా, గానుగ ఆడించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో కాకుండా ఇప్పుడు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అవసరమైన రైతులందరికీ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లోనూ విత్తనాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారి సంధ్య, వైస్ ఎంపీపీ గజేంద్ర, సర్పంచ్‌లు మునస్వామి, గోవిందుస్వామి, విశ్వనాథ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మేనక, జిల్లా ఆహార కమిటీ సభ్యురాలు రత్నారెడ్డి, వైస్ సర్పంచ్ నరసింహారెడ్డి, మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

సదుం: సబ్సిడీ ధరతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రాయితీ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో విత్తనకాయల పంపిణీని వారు శుక్రవారం ప్రారంభించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఏఓ హరిప్రసాద్, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, సర్పంచులు ఉషారాణి, హనుమంతరెడ్డి, పుట్రాజు పాల్గొన్నారు.

ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలి

గంగవరం: వేరుశగన విత్తన కాయలు అవసరమైన రైతులు తప్పనిసరిగా ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి హేమలత తెలిపారు. రెండో రోజు శుక్రవారం మండలంలోని మామడుగు, పత్తికొండ, కీలపల్లె, పసుపత్తూరు, గుండుగల్లు, మారేడుపల్లె సచివాలయాల పరిధిలో జరుగుతున్న విత్తనాల నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. నమోదు అనంతరం పంపిణీ సమయంలో టోకెన్‌లు పొందిన రైతులకు మాత్రమే విత్తనకాయలు పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా రెండు రోజులు పాటు జరిగిన నమోదు కార్యక్రమంలో ఇప్పటివరకూ దాదాపు 1400 మంది రైతులు మాత్రమే నమోదు చేసుకున్నారన్నారు. మండలంలో 1476 క్వింటాళ్ల రైతులకు పంపిణీ చేసేందుకు అందుబాటులో ఉన్నాయని, ఇంకా అవసరమైన రైతులు వీలైనంత త్వరగా నమోదు చేసుకోవాలి కోరారు.



పలమనేరు: కల్లాడలో విత్తనాల పంపిణీ

నేటి నుంచి వేరుశనగ విత్తనాలు పంపిణీ

పుంగనూరు: మండలంలోని బోడేవారిపల్లె ఆర్‌బీకేలో శనివారం నుంచి వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తామని ఏఓ రాజేష్ తెలిపారు. రైతులు తమ ఆధార్, పట్టాపాసుపుస్తకం తీసుకొచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని కోరారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు రానీయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దామోదర రాజు

చౌడేపల్లె: గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రామమూర్తి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం రాయితీతో పంపిణీ చేసే వేరుశనగ విత్తన కాయలు రైతులకు ఒక్కో బస్తా కాకుండా రైతుల భూమి విస్తీర్ణం అవసరాన్ని గుర్తించి పంపిణీ చేయాలని సూచించారు. కొండయ్యగారిపల్లెలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందిపడుతుండే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల పని తీరు సరిగా లేదని, రోగులకు మెరుగైన సేవలు అందించడంతో విఫలమవుతున్నారని తెలిపారు. మంజూరైన నిధులు కూడా దుర్వినియోగం చేశారని నిలదీశారు. ఆస్పత్రి ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోయినా పట్టించుకోకపోవడం బాధాకరమని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో క్యాంపులు, మీటింగ్లు, శిక్షణల పేరుతో వైద్యులు విధులకు డుమ్మా కొడుతున్నారని, ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సమావేశంలో తీర్మానించారు. వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా అభివృద్ధి నివేదికలను వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీడీఓ సుధాకర్ పాల్గొన్నారు.